ముడసర్లోవ రోడ్లపై డెబ్రిస్ దిబ్బలు

- విశాలమైన రోడ్లపై నగరంలోని పలు ప్రాంతాల నుంచి గృహ వ్యర్థాల డంపింగ్
- మరోవైపు ఇరువైపులా భారీగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, తుప్పలు
- భయంతో రాకపోకలు తగ్గించేసిన వాహనదారులు, వాకర్స్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్న మందుబాబులు, గంజాయి బ్యాచ్
- వ్యర్థాల డంపింగ్‌ను అడ్డుకోవడంలో జీవీఎంసీ అధికారులు విఫలం

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లు మట్టి దిబ్బలు, పిచ్చి మొక్కలతో నిండిపోతున్నాయి. ఇవి ప్రశాంతమైన వాతావరణాన్ని కలుషితం చేయడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇక్కడి వాతావరణం పచ్చని కొండల మధ్య విశాలమైన రోడ్లతో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. విశాలామైన ఈ రోడ్లలో వాహన చోదకులతోపాటు ఉదయం సాయంత్రం నడక కోసం అధిక సంఖ్యలో వాకర్స్ వస్తుంటారు. నిత్యం ఈ ప్రాంతం జన సంచారంతో ఉండేది. ఇప్పుడు ఈ రోడ్లు గృహ నిర్మాణ వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో నిండిపోతున్నాయి. దీంతో జన సంచారం తగ్గిపోయింది. ప్రస్తుతం ఇక్కడి విశాలమైన రోడ్లు కుచించుకుపోతున్నాయి. ఓ వైపు తుప్పలు, మరో వైపు మట్టి దిబ్బలతో రోడ్లు మూసుకుపోతున్నాయి. ఈ మూసుకుపోతున్న రోడ్ల మధ్య చెట్ల పొదల్లో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం ఈ రోడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సందడి అంతా మాయం

నిత్యం జలకళతో చల్లదనాన్ని అందించే ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక కొండల మధ్య నుంచి సుమారు 18 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం విశాలమైన డబుల్ రోడ్లు నిర్మించింది. ఆరిలోవ ప్రాంతవాసులు ఆ రోడ్ల నుంచి ప్రయాణించి రామకృష్ణాపురం వద్ద బీఆర్‌టీఎస్‌కు చేరుకునేవారు. ఆహ్లాదకరమైన వాతావరణం కావడంతో ఎక్కువ మంది ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ రోడ్లపై వాకింగ్‌కు వెళ్లేవారు. దీంతోపాటు కానిస్టేబుళ్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల ఉద్యోగాల నియామకం కోసం పోలీస్ అధికారులు ఈ రోడ్లపైనే ఐదు కిలోమీటర్ల పరుగు పరీక్ష (పోటీలు) నిర్వహించేవారు. తరుచూ ఈ పోటీలతో పోలీసుల సందడి కనిపించేది. ఇప్పుడు ఆ పరిస్థితి కానరావడం లేదు. అటువైపు వెళ్లడానికే జనం భయపడే పరిస్థితి నెలకొందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇక్కడే రైల్వే జోన్ పనులు..

ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లున్న ప్రాంతంలోనే రైల్వే జోన్ కార్యాలయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్లను ఆనుకుని ప్రభుత్వం రైల్వే జోన్ కోసం 56 ఎకరాల భూమి కేటాయించింది. సుమారు ఏడాదిగా రైల్వే శాఖ అధికారులు పనులు చేస్తున్నారు. ఆ పనుల కోసం ఈ రోడ్ల నుంచే భారీ వాహనాలు, లారీలు సామగ్రి తరలిస్తున్నాయి. ఇక్కడ మట్టి దిబ్బలతో రోడ్లు మూసుకుపోవడంతో ఆయా వాహనాల రాకపోకలకు ఇక్కడ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న రైల్వే జోన్ పనులకు ఈ మట్టి దిబ్బలు ఆటంకంగా నిలుస్తున్నాయి.



ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్డు సగం వరకు గృహ వ్యర్థాల దిబ్బలు



ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్డుకు ఒక వైపు డెబ్రిస్ దిబ్బలు, మరోవైపు కేబుల్ తీగల చక్రాలు

ఎటుచూసినా మట్టి దిబ్బలే..



ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లకు ఇరువైపులా మట్టి దిబ్బలు

ప్రస్తుతం ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్లు మట్టి దిబ్బలతో మూతపడుతున్నాయి. ఆ మట్టి దిబ్బలు వల్ల ఇక్కడ ఉన్న 80 అడుగుల వెడల్పు తారు రోడ్లు సుమారు 20 అడుగులకు కుదించుకుపోయాయి. ఎటు వైపు చూసినా మట్టి దిబ్బలే కనిపిస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. ఆరిలోవ ప్రాంతంతోపాటు ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, వెంకోజీపాలెం, విశాలాక్షినగర్, సింహాచలం ప్రాంతాల నుంచి గృహ వ్యర్థాలను ఇక్కడకు లారీల్లో తీసుకొచ్చి రోడ్ల పక్కన డంప్ చేసేస్తున్నారు. అలా వేస్తూ వేస్తూ రోడ్డులో సగ భాగానికి పైగా దిబ్బలతో నింపేశారు. దీంతో ఈ రోడ్లు మూసుకుపోయి ఇరుకుగా మారాయి. ఈ మట్టి దిబ్బలు ఉండటంతో వాహనచోదకులు అటుగా వెళ్లడం మానేశారు. వీటికి తోడు రోడ్డుకు ఇరుపక్కలా పిచ్చి మొక్కలు, ముళ్ల తుప్పలు భారీగా పెరిగిపోయాయి. ఈ మొక్కలు ఏపుగా పెరిగి మిగిలిన రోడ్డు భాగాలను సైతం మూసేస్తున్నాయి. ఆ మొక్కల చాటున మందుబాబులతోపాటు గంజాయి, మద్యం సేవించే వారు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు చేరుతున్నారు. దీంతో అటుగా వెళ్లాలంటేనే స్థానికులు హడలిపోతున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి మట్టి దిబ్బలు పేరుకుపోతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇక్కడ డెబ్రిస్ వేయకుండా జీవీఎంసీ అధికారులు అడ్డుకట్ట వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందువల్లే ఇష్టారాజ్యంగా ఇక్కడికి వ్యర్థాలు డంప్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

జీవీఎంసీకి రూ.లక్షల్లో ఖర్చు

కొన్ని సంవత్సరాలుగా ఆరిలోవ ప్రాంతంతోపాటు నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి గృహ వ్యర్థాలను ఇక్కడకు లారీలతో తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. రోడ్లన్నీ మూసుకుపోవడం, వర్షాకాలంలో వాటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు వెళ్లిన తర్వాత జీవీఎంసీ అధికారులు అప్పుడప్పుడు స్పందిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆ వ్యర్థాలను జేసీబీలతో చదును చేయించి వదిలేస్తున్నారు. మళ్లీ అక్కడ గృహ వ్యర్థాలు వేయకుండా నిఘా పెట్టడం లేదు. దీంతో మరుసటి రోజు నుంచే వ్యర్థాలను యథావిధిగా డంప్ చేసుకుపోతున్నారు. మూడున్నరేళ్ల క్రితం జీవీఎంసీ అధికారులు సుమారు రూ.40 లక్షలు ఖర్చు చేసి ఇక్కడి రోడ్లపై వ్యర్థాల దిబ్బలను చదును చేయించి వదిలేశారు. తర్వాత మళ్లీ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పరిస్థితి దారుణంగా తయారైంది. జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడ వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టి పర్యావరణాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



దట్టమైన పిచ్చి మొక్కల మధ్య రోడ్డుపై నడుస్తున్న వాకర్స్

క్లుప్తంగా

ఒకటిన కళాభారతిలో పోటీలు

మద్దిలపాలెం: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షపై విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబర్ 1న మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌ఎన్ రాజు, గుమ్ములూరి రాంబాబు తెలిపారు. హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి నగదు, పుస్తకాలు బహుమతులుగా అందిస్తామని తెలిపారు. వివరాల కోసం 9393100434, 98481 99955లో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలి

ఏయూ క్యాంపస్: పండగ వేళల్లో ఆరోగ్యకర ఆహారానికి ప్రాధాన్యమివ్వాలని ఆయుర్వేద నిపుణురాలు డాక్టర్ మధుమిత కృష్ణన్ సూచించారు. బీచ్‌రోడ్డులో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సహజ ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన బాదం పప్పుని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. రక్తంలో చక్కెర నియంత్రణకు, కండరాల పునరుద్ధరణకు ఇది ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. చర్మ ఆరోగ్యానికి సైతం బాదం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తికాక ఇబ్బందులు



పిఠాపురం కాలనీలో కల్వర్టు నిర్మాణం కోసం తవ్విన గొయ్యిలో కూరుకుపోయిన కారు

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పరిధి పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియం ఎదురుగా ఉన్న రోడ్డులో కల్వర్టు నిర్మాణం రెండు నెలలవుతున్నా పూర్తి చేయలేదు. దీంతో ఆ కాలనీ నివాసితులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు నిర్మాణం కోసం తవ్విన గొయ్యిలో కార్లు, ఇతర వాహనాలు కూరుకుపోతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులైతే రాత్రి వేళల్లో ఈ గోతిలో పడి గాయాల పాలవుతున్నారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేయకుండా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తాత్సారం చేస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. కాలనీని రహదారితో అనుసంధానం చేసే చోట కల్వర్టు నిర్మాణానికి పెద్ద గొయ్యి తవ్వేసి వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని... ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ విజిలెన్స్ డిపార్టుమెంట్, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖపట్నం పోర్టు అథారిటీ విజిలెన్స్ ఆఫీసర్ టీవీ శ్రీనివాసరావు విద్యార్థులకు విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా ఇష్యూస్ రిలేటింగ్ టు విజిలెన్స్ అండ్ ఫైట్ అగైనెస్ట్ కరప్షన్ అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎస్.అనురాధ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.అనూష, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మలా పింక్ టాయిలెట్



జాతీయ రహదారి పక్కన డెయిరీఫారం వద్ద జీవీఎంసీ పింక్ టాయిలెట్

ఆరిలోవ: జాతీయ రహదారిపై పాత డెయిరీఫారం వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన పింక్ టాయిలెట్ దిష్టి బొమ్మలా మారింది. ఇది రహదారిని ఆనుకుని ఖాళీ స్థలంలో సుమారు ఆరేళ్ల క్రితం జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై వాహనాల్లో ప్రయాణించే మహిళలకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడుతుందనే ఆలోచనతో ఏర్పాటు చేశారు. అయితే మహిళలు దీన్ని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై వెళ్తున్నప్పుడు దీని ముందు గ్రీన్‌బెల్ట్ ఉండడంతో ఇక్కడ టాయిలెట్ ఉన్న విషయాన్ని కొంత దూరం నుంచి గమనించలేకపోతున్నారు. హనుమంతవాక కూడలి వద్ద కొన్ని మీటర్ల దూరంలో ఈ టాయిలెట్ ఉన్నట్లు సూచిక బోర్డు ఏర్పాటు చేస్తే వినియోగించుకోవడానికి అవకాశం కలుగుతుందని మహిళలు భావిస్తున్నారు. దీంతోపాటు ఈ టాయిలెట్‌ను ఆనుకుని రెండు వైపులా ఉన్న ఖాళీ స్థలంలో జీవీఎంసీ వాహనాలకు మరమ్మతులు చేపట్టే మెకానిక్ షెడ్ ఏర్పాటు చేశారు. షెడ్‌కు తీసుకెళ్లే పొక్లెయిన్లు, కార్లు, ట్రాక్టర్లు, లారీలు తదితర వాహనాలను ఇక్కడ పింక్ టాయిలెట్ చుట్టూ నిలుపుతున్నారు. వాటికి ఇక్కడ మరమ్మతులు చేపడుతున్నారు. ఒక్కోసారి వాహనాలను దీనికి అడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో అవసరమైనప్పటికీ ఈ టాయిలెట్‌ను వినియోగించుకోలేకపోతున్నామని మహిళలు అంటున్నారు.

బస్టాప్‌లో అంధకారం



పెదగదిలి స్మార్ట్ బస్ షెల్టర్ వద్ద చీకటి

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఈ కూడలి అంధకారంలో మగ్గుతోంది. ఇక్కడ స్మార్ట్ బస్ షెల్టర్లు వద్ద కూడా విద్యుత్ దీపాలు వెలగడం లేదు. కొన్ని రోజులుగా ఇక్కడ అంధకారంలోనే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నగరానికి వెళ్లడానికి పెదగదిలి, సింహగిరికాలనీ తదితర కొండవాలు వాసులు ఇక్కడే బస్‌లు, ఆటోల కోసం నిరీక్షిస్తారు. రాత్రివేళల్లో సుమారు 9 గంటల వరకు ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఉంటుంది. వారంతా ఇక్కడ చీకటిలో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధునిక స్మార్ట్ బస్ షెల్టర్లు నిర్మించింది. ఆ షెల్టర్లలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విద్యుత్ దీపాలు వెలిగించలేకపోతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ బస్టాప్ వద్ద దీపాలు వెలిగించాలని కోరుతున్నారు. దీంతోపాటు బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి నుంచి సంజయ్‌గాంధీ కాలనీ వరకు వీధి దీపాలు వెలగక చీకట్లు అలుముకున్నాయి.

క్రమశిక్షణతో గొప్ప నాయకులుగా రాణింపు



ప్రసంగిస్తున్న రేపల్లె శ్రీరామారావు

మద్దిలపాలెం: యువతరం నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఓఎన్‌జీసీ సీజీఎం రేపల్లె శ్రీరామారావు సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మంగళవారం ప్రసంగించారు. నాయకుడిగా రాణించాలనుకునే వ్యక్తులు ముందుగా స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే వారు గొప్ప నాయకులుగా నిలుస్తారని చెప్పారు. క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ప్రధానమని సూచించారు. అబ్రహాం లింకన్, వివేకానంద జీవితాలను ఉదహరిస్తూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన నాయకత్వ లక్షణాలు వివరించారు. యువతరం భవిష్యత్ భారతావనిని ఉన్నతంగా తీర్చిదిద్దే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతోపాటు బహుముఖ ప్రజ్ఞ, నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం మాట్లాడుతూ మార్గనిర్దేశం చేస్తూ ఇతరులను ముందుకు నడిపించే వాడే నాయకుడిగా నిలుస్తాడని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీరామారావును కళాశాల తరపున సన్మానించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం



అంతరిక్ష వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో–ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 'ఉర్వికృతి' విద్యార్థి విభాగం, ఇండియన్ సొసైటీ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో పెరుగుతున్న వ్యర్థాలకు పరిష్కారం కనుగొనాలని విద్యార్థులకు సూచించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పి. జగదీశ్వర రావు ఇస్రో కార్యకలాపాలపై, ఆచార్యులు డి.లలిత భాస్కర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అంతరిక్ష సమాచార సాంకేతికతపై మాట్లాడారు.

నేటి నుంచి సప్త శక్తి సంగం - మాతృశక్తి సమ్మేళనం

సీతంపేట: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ పిలుపు మేరకు బుధవారం నుంచి మాతృమూర్తుల సప్త శక్తి సంగం – మాతృశక్తి సమ్మేళనం నిర్వహిస్తామని దక్షిణ మధ్య క్షేత్ర బాలికా విద్యా ప్రముఖ్ డాక్టర్ ధరణి ప్రియ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యామందిర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోటి మంది మాతృమూర్తులను కలవాలనే ఉద్దేశంతో సప్త శక్తి సంగం పేరుతో ఈ నెల 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 23 వరకు విద్యాభారతి నిర్వహిస్తున్న అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యాభారతి ఏపీలో 450 సప్తశక్తి సంగమాలు నిర్వహించి, 1.50 లక్షల మంది మాతృమూర్తులను కలవాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కల్తీ మద్యంతో ప్రాణాలు తీసేస్తున్నారు

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గమైన చర్య
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

ఆరిలోవ: కూటమి పాలనలో కల్తీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలు తీసేస్తున్నారని వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ పదో వార్డులో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో 24 రోజులపాటు నిర్వహించిన కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి మొల్లి అప్పారావు రవీంద్రనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కూటమి పాలన వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ముద్రించిన కరపత్రాలను అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలు, సంక్షేమ పథకాల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మోసపూరిత హామీలిచ్చి గెలుపొందారన్నారు. గెలిచిన తర్వాత హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అభివృద్ధి చేయడం లేదు సరికదా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను కూడా కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసి పేదలకు ఉచిత వైద్యం అందకుండా చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నారని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజలను సంక్షేమ పథకాల అమలు విషయంలో మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, ప్రధాన కార్యదర్శి గూడపాటి విక్టర్, జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాస్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు వైదా నారాయణరావు, ఎస్సీ విభాగం అధ్యక్షుడు బంగారు భవానీశంకర్, నాయకులు పతివాడ వెంకటలక్ష్మి, కన్నబాబు, చలం, అబ్దుల్ రావుఫ్, తులసి, గోవింద్, శ్రీను, పైడిరాజు, కాంతం, వీరమ్మ, కుమారి, రాధ, దేవి, చిట్టి, చౌదరి, సత్యవతి, జ్యోతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం



సీపీఆర్‌పై విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: విశాఖపట్నంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీపీఆర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు సీపీఆర్ అత్యవసర దశల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలని సూచించారు. ఐఆర్‌సీఎస్ చైర్మన్ సి.బాలసతీష్ మాట్లాడుతూ రోగి ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్‌ను ఆయన ప్రశంసించారు. ట్రైనర్ డాక్టర్ పి.రామారావు ప్రత్యక్షంగా సీపీఆర్ చేసి చూపించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు, ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, ఎస్.వి.రామారావు, టి.రామకృష్ణ, సీహెచ్.సాయికృష్ణ పాల్గొన్నారు.

మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సౌకర్యాల పరిశీలన



పోలీస్ స్టేషన్‌లో పరిశీలిస్తున్న అధికారులు

బీచ్‌రోడ్డు : మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా అధికారులు మంగళవారం సందర్శించారు. నిందితులకు, ఫిర్యాదుదారులకు పోలీస్ స్టేషన్‌లో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మౌలిక సౌకర్యాలు, వసతులు, మరుగుదొడ్లు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వెలుపల, లోపల భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా అధికారులతోపాటు లా అండ్ ఆర్డర్ సీఐ పైడయ్య, ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌ల ఐఎఫ్‌టీ సేవలపై సమీక్ష

మహారాణిపేట: అత్యవసర సమయంలో రోగుల్ని, క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు చేర్చే 108 వాహనాల సేవలు కొన్నిసార్లు తమకు అందట్లేదని ప్రజల ఆరోపణ. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ప్రధాన ఆస్పత్రులకు రిఫరల్ కేసులు రావ్వాను అధికమవుతుండటం వల్లే ఈ జాప్యం నెలకొంటోందని 108 సిబ్బంది వాదన. హైరిస్క్ కేసుల్ని మాత్రమే ఇలా తరలించాల్సి(ఐఎఫ్‌టీ) ఉన్నప్పటికీ కొన్ని సార్లు రోగుల ఒత్తిళ్లతో చిన్న చిన్న కేసుల తరలింపునకూ 108 అంబులెన్స్‌ల్ని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచనల మేరకు 108 వాహన వ్యవస్థ జిల్లా మేనేజర్ ఎం.సురేష్‌కుమార్, పైలెట్లు, ఈఎంటీలు మంగళవారం గోపాలపట్నం సీహెచ్‌సీకి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతతో 108 జిల్లా మేనేజర్ సురేష్‌కుమార్ పలు అంశాలపై చర్చించారు. అత్యవసర కేసుల్ని మాత్రమే ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయా వాహనాల పరిస్థితిని సురేష్ పరిశీలించారు. డాక్టర్ సుజాత సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో 108 వ్యవస్థ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే ఆనందకర జీవితం



డాక్టర్ కిషోర్‌బాబును సత్కరిస్తున్న ప్రతినిధులు

సీతంపేట: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ అనేక రకాల సమస్యలతో విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కిషోర్‌బాబు అన్నారు. నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ విశాఖపట్నం చాప్టర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'ఒత్తిడిని జయించే విధానం' పై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. నిజజీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని తేలికగా తీసుకోవాలన్నారు. చక్కని ప్రణాళికలతో స్థిరత్వంతో జీవిస్తూ మానసికంగా దృఢత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. అప్పుడే ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యవంతమైన జీవితంతో ఆనందంగా జీవించవచ్చన్నారు. పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే వారందరూ ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో చాప్టర్ ప్రెసిడెంట్ కె.వి.రావు, ఆచార్య సాంబశివరావు, శేషగిరిరావు, పి.భాస్కర్, శ్రీనివాస్, ఆర్.సుధాకర్, శ్రీరాములు, కృష్ణకుమార్, శివప్రసాద్, ఎస్‌పీఎస్ సుధాకర్ పాల్గొని డాక్టర్ కిషోర్‌బాబును సత్కరించారు.